జీవన్ రాకతో కాంగ్రెస్ పార్టీకి కొండంత బలం



దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జీవన్ సింగ్ తదితరులు

– దానం నాగేందర్

అబిడ్స్/గోల్కొండ: జీవన్ సింగ్ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి కొండంత బలం చేకూరిందని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ పేర్కొన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా కొన్ని సంవత్సరాల పాటు పనిచేసిన ఠాకూర్ జీవన్ సింగ్ తన అనుచరరులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ..నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంతో పట్టు ఉన్న జీవన్‌సింగ్ గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల నాయకుడుగా కొనసాగారన్నారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ.. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు ఈ ఎన్నికల్లో దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన అన్నారు. జీవన్ సింగ్‌తో పాటు నిహాల్ సింగ్, శ్రీకాంత్, అశోక్ తేజ, రాజేందర్ యాదవ్, నర్సింగ్‌రావు, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ఐఎన్‌టీయూసీ కృషి..

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని ఇండియన్ నేషనల్ మున్సిపల్ జనరల్ సెక్రెటరీ, ఐఎన్‌టీయూసీ, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ జీహెచ్‌ఎంసీలో పలు ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ మాట్లాడుతూ..ప్రతి ఉద్యోగి, ప్రతి కార్మికుడు సికింద్రాబాద్, హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిచేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు ఎల్లవేళల ఐఎన్‌టీయూసీ అనుబంధ మున్సిపల్ మజ్దూర్ సహకార యూనియన్ అండగా ఉండి వారికి విశేష సేవలందిస్తుందన్నారు.



ఐఎన్‌టీయూసీలో చేరిన పలువురు ఉద్యోగులు

10 నుంచి బసవేశ్వరుడి జయంత్యుత్సవాలు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బసవేశ్వరుడు

- రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న కన్నడీగులు

చార్మినార్: సమాజంలో కుల వ్యవస్థను వర్ణ విభేదాలు, లింగ వివక్షను వ్యతిరేకించిన అభ్యుదయ వాది శ్రీ మహాత్మా బసవేశ్వరుడు. ఆయన 891వ జయంత్యుత్సవాలు ఈనెల 10న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా బసవేశ్వర జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుండడంతో తెలంగాణలోని కన్నడీగులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణకు వచ్చిన కన్నడీగులు తమ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఇక్కడి ప్రజలతో కలసి సహజీవనం చేస్తున్నారు.

బసవేశ్వరుడి సేవలు ఎనలేనివి..

అణగారిన జాతుల అభివృద్ధి కోసం మహాత్మా బసవేశ్వరుడు చేసిన సేవలు ఎనలేనివి. చిన్ననాటి నుంచే సామాజిక సేవా కార్యక్రమాల చురుగ్గా పాల్గొనేవాడు. 1134లో కర్ణాటకలోని బాగేవాడిలో మాదిరాజు, మాదలాంబికల దంపతులకు బసవేశ్వరుడు జన్మించారు. వేద పండితుల కుటుంబంలో జన్మించిన ఆయన చాళుక్యుల సామ్రాజ్యం పాలనలో కల్యాణం రాజధాని ప్రధాన మంత్రిగా పనిచేశారు. అంటరానితనాన్ని గట్టిగా వ్యతిరేకించారు. వీరశైవ ధర్మ ప్రచారం చేశారు. ఇష్టలింగ పూజ.. మహిళలకు సమాన హక్కుల కోసం కృషి చేశారు. విశ్వగురు, విశ్వ జ్యోతి పేర్లతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బసవేశ్వరుని శిలా విగ్రహాన్ని లండన్‌లో ఏర్పాటు చేశారని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు.



బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి తదితరులు

బసవ భవన్ నిర్మించాలి..



అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేసిన మహాత్మా బసవేశ్వరుని జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉంది. కోకాపేట్‌లో బసవ భవన్ నిర్మాణానికి గత ప్రభుత్వం ఒక ఎకరం భూమి కేటాయించిందని.. అయితే భవన నిర్మాణం జరగలేదు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయించాలని కోరుతున్నాం.

– నాగ్‌నాథ్ మాశెట్టి, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు

పాఠ్యాంశాలను అందుబాటులోకి తేవాలి..



బసవేశ్వరుని చరిత్రతో పాటు ఇతర అంశాలను పొందుపరుస్తూ తెలుగు విద్యార్థుల సౌకర్యార్థం తెలుగులో కేజీ టూ పీజీ పాఠ్యాంశంగా అందుబాటులోకి తేవాలి. ఎన్నో ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి ఇక్కడి తెలుగు ప్రజలతో మమేకమై శాంతి, సహజీవనం చేస్తున్న కన్నడీగుల కోసం తెలుగులో పాఠ్యాంశంగా ఉండాలని కోరుకుంటున్నాం.

– కల్వ మల్లికార్జునప్ప, బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు

'దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం'

సుల్తాన్‌బజార్: కోరుట్ల ఆసుపత్రిలో వైద్యుడిపై దాడిచేసిన వారిపై చర్యలు ప్రారంభమయ్యాయని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో కమిషనర్ అజయ్‌కుమార్‌తో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు డాక్టర్ వినయ్‌కుమార్, చైర్మన్ డాక్టర్ రావూఫ్ కో చైర్మన్ మరియమ్మ, కన్వీనర్ సోమ మల్లన్న, సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కోరుట్ల ఘటనను తమ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. డాక్టర్ శ్రవణ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అమృత్‌రావు, పాండు, ఆదిలక్ష్మి, భూ లక్ష్మి, వీరేష్, క్రిష్టఫర్, శైలజ, డేవిడ్, రవికుమార్, స్వర్ణలత పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి




కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న ప్రజలు

గోల్కొండ: అసదుద్దీన్ ఒవైసీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను మజ్లిస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు షకీల్ ఆలీఖాన్, హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్ తదితరులున్నారు.

లంగర్‌హౌస్‌లో మజ్లిస్ ప్రచారం..

లంగర్‌హౌస్: కార్యకర్తల కుటుంబీకులతో మమేకవుతూ అందరని మరింత ఉత్సాహ పరుస్తూ ఎమ్మెల్యే కౌసర్ ప్రచారం జోరుగా సాగుతోంది. మజ్లిస్ సీనియర్ నాయకుడు టి.శివశంకర్ ఆధ్వర్యంలో బుధవారం లంగర్‌హౌస్‌లో ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ ప్రచారం నిర్వహించారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి, పగిడీలు ధరించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాందాస్‌పుర, హరిదాస్‌పుర, కాళిదాస్‌పురలో తిరుగుతూ బస్తీల పెద్దల ఇళ్లలోకి ఎమ్మెల్యే వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. శివశంకర్, సునంద, శారద పాల్గొన్నారు.



మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి



బైక్ ర్యాలీలో పాల్గొన్న దేవర వంశీ, బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న జియాగూడ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

గోల్కొండ: ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులతో కలిసి ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీలో వందలాది బీజేపీ, బీజేవైఎం ఇతర మోర్చాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కేంద్రం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి..

జియాగూడ: 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. జియాగూడలోని సంజయ్‌నగర్, కేశవస్వామినగర్, ఇంద్రానగర్‌లలో కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..సమర్థవంతమైన పాలన కోసం మరోసారి నరేంద్రమోదీని, హైదరాబాద్ ఎంపీగా మాధవీలతను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా డెయిరీసెల్ కన్వీనర్ బి.శివకుమార్‌యాదవ్, సీనియర్ నాయకుడు దర్పల్లి నర్సిములు, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, సతీష్‌బిట్ల, జగన్నాథప్ప, కిషన్‌దామ, సోపు యాదవ్, అశోక్ పాల్గొన్నారు.


ఉత్సాహంగా కిషన్‌రెడ్డి రోడ్ షో




రోడ్ షోలో భాగంగా జీపు మీద ప్రయాణిస్తున్న కిషన్‌రెడ్డి

నాంపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ జి.కిషన్‌రెడ్డి నాంపల్లిలో చేపట్టిన రోడ్ షోకు విశేషమైన స్పందన లభించింది. రోడ్ షోకు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు బైక్ ర్యాలీ చేపట్టారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని తాళ్లగడ్డ జైన్ మందిర్ వద్ద ప్రారంభమైంది. అక్కడి నుంచి కబ్బాడి స్టేడియం, శారదానగర్, మహవీర్ యాదవ్‌నగర్, ప్రియా కాలనీ, సాయిబాబా ఆలయం, శాంతినగర్, మందులగూడ, నవోదయ కాలనీచ భోజగుట్ట, వివేకానందనగర్, హుడా కాలనీ, సంతోష్‌నగర్ పార్కు, శ్రీరామ్ టెంపుల్ అహ్మద్‌నగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..ఈనెల 13న జరిగే పోలింగ్‌లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి 400 సీట్లు రావాలని ఆకాంక్షించారు. బీజేపీతోనే దేశ అభివృద్ధి జరుగుతుందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గౌతమ్‌రావు, నాంపల్లి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొల్లూరి పవన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పథకాలే పద్మారావును గెలిపిస్తాయి'



ప్రచారం చేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్, అజిత్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు



జియాగూడలో.. జగదీష్‌యాదవ్, నరహరిచారి

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతోనే సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ విజయం సాధిస్తారని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎంత అసత్య ప్రచారాలు చేసినా బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు.

అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతులు ఇవ్వలేకపోతుందన్నారు. పద్మారావు గౌడ్‌ను గెలిపిస్తే సికింద్రాబాద్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తీగల అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాలో బైక్ ర్యాలీ..

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ మహంకాళి ఆలయం, బాలాగంజ్, గౌలిపురా, అయోధ్యనగర్, అంబికానగర్, హనుమాన్‌నగర్, ఛత్రినాక ప్రాంతాల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పోలోజు సంతోష్ కుమార్, పుష్పాల రాధాకృష్ణ, మణికొండ విజయ్‌కుమార్, నాగరాజు, వర్కల ఆనంద్ మోహన్, మహేందర్, సాయి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి ...

జియాగూడ: హైదరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకుడు ఆరేల్ల జగదీష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు నరహరిచారిలు అన్నారు. బుధవారం జియాగూడలోని వెంకటేష్‌నగర్, లక్ష్మీనరసింహానగర్, రంగనాథనగర్, కంచర బస్తీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, కార్వాన్ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ రాములు, చంద్రకాంత్, కృష్ణదాస్, దేవేందర్ సాగర్, ప్రకాష్, హేమంతరాజ్, మోహన్, భిక్షపతి, అనిత, మనోజ్, కె.నర్సింగ్‌రావు, అరుణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల (సాయంత్రం)లో వివిధ తెలుగు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 1965లో ప్రారంభమైన ఈ కళాశాలలో తెలుగు భాష సాహిత్యాలలో పీడీసీ (ప్రీ డిగ్రీ) కోర్సు, బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్ కోర్సులు నడుస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల పీడీసీ కోర్సుకు అర్హులు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన వారు బీఏ లాంగ్వేజెస్‌లో డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం (దోస్త్) ద్వారా ప్రవేశం పొందవచ్చు. తెలుగు ద్వితీయ భాషగా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఎంఏ లాంగ్వేజెస్‌కు అర్హులు. వివరాలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సిల్మానాయక్ ఫోన్:90328 12971లో సంప్రదించవచ్చని కళాశాల కరస్పాండెంట్, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



గౌలిపురా: ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. బుధవారం చార్మినార్ నియోజకవర్గంలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. లాల్‌దర్వాజాలోని నివసించే కాంగ్రెస్ నేత వెంకటేశ్ ఇంటికి వచ్చిన బీఎల్‌ఓ వినోద్ కుమార్ ఓటరు స్లిప్పులను వెంకటేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..బూత్ లెవల్ ఆఫీసర్లు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులను తప్పనిసరిగా అందజేయాలన్నారు.

వెబ్‌సైట్ ప్రారంభం

గన్‌ఫౌండ్రీ: మహిళలకు చక్కటి ఆభరణాలను తయారు చేసి అందించడమే తమ లక్ష్యమని మిసెస్ ఇండియా కృష్ణ తోడేటి అన్నారు. బుధవారం హౌజ్ ఆఫ్ హీరే వజ్రాభరణాల వెబ్‌సైట్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..సరికొత్త ఆవిష్కరణలతో విలాసవంతమైన వజ్రాభరణాలను అందించేందుకు ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని రకాల ఆభరణాలపై 20 శాతం తగ్గింపుతో వినియోగదారులకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీసు ఉన్నతాధికారులు వెంకట్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రచయిత్రి తాటికొండ కళావతి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

నాంపల్లి: పార్కింగ్ చేసిన ఆటోలో ఓ ఆటో డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తబందా కేఫ్ వద్ద చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం..బోయిగూడ కమాన్ వద్ద నివాసం ఉండే ఈశ్వరయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో నర్సింహ(62) 30 ఏళ్ల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. హబీబ్‌నగర్‌లోని యూసుఫియన్ దర్గా వద్ద స్థిరపడ్డారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన నర్సింహ తన మతాన్ని మార్చుకుని అహ్మద్‌గా నామకరణం చేసుకున్నారు. ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం తబందా కేఫ్ వద్ద పార్కింగ్ చేసిన ఆటోలో సేదతీరాడు. నిద్రలోనే గుండెపోటు రావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

'అద్దంకి దయాకర్‌కు గుణపాఠం చెబుతాం'



రాజేష్‌యాదవ్

అబిడ్స్: హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌కు తగిన గుణపాఠం చెబుతామని గ్రేటర్ హైదరాబాద్ బీజేవైఎం సీనియర్ నాయకుడు, నగర శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి అధ్యక్షుడు బి.రాజేష్‌యాదవ్ పేర్కొన్నారు. భారతీయుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడు, సీతాదేవీలపై అద్దంకి దయాకర్ వ్యంగ్యంగా మాట్లాడడం బాధాకరమన్నారు. ఇటలీ నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంటు ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా చేస్తామన్నారు. ప్రతి హిందువు బీజేపీ ఓటు వేసి కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. అవగాహన లేకుండా అద్దంకి దయాకర్ మాట్లాడడం సిగ్గుచేటని రాజేష్‌యాదవ్ పేర్కొన్నారు.

ప్రతిభావంతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి



గోల్కొండ: ప్రతిభావంతులు వ్యాపారవేత్తలుగా ఎదిగితే ఆ దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుందని డీ–హబ్ ఫౌండర్ కొప్పుల వసుంధర అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సమాజంలో వివక్షత, చిన్నచూపు, సామాజిక వ్యతిరేకత, మౌలిక సదుపాయాల కొరత మొదలైన అంశాలపై డీ–హబ్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక సమతూల్యతలు కూడా అభివృద్ధిపై ప్రభావం చూపుతాయని తెలిపారు. జీఎస్‌ఐటీఎస్ డైరెక్టర్ శ్రీవిద్యారెడ్డి మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనుకునే ఆలోచన భిన్నమైందన్నారు. దీని కోసం డీ–హబ్ ఇగ్నాట్‌ను రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, డైరెక్టర్ నరేందర్ దేవులపల్లి, కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ శాశ్వత్ పాటక్, డాక్టర్ హఫీజ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

– ముగ్గురికి గాయాలు



సంతోష్‌నగర్: కారును వేగంగా నడిపి కాంపౌండ్ వాల్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి, ఎస్సై లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మీర్‌పేట్ జిల్లెలగూడ కమలానగర్‌కు చెందిన గోవర్ధన్‌రెడ్డి కుమారుడు పవన్ రెడ్డి (21) విద్యార్థి. ఈనెల 7న రాత్రి 11 గంటలకు పవన్‌రెడ్డి తన స్నేహితుడు కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు జిల్లెలగూడలోని భాష్యం స్కూల్ గ్రౌండ్‌కు వెళ్లారు. అక్కడ పవన్‌రెడ్డి, సాయికుమార్, ముఖేశ్, వంశీ, కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించుకొని మద్యం సేవించారు. అనంతరం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఐఎస్‌సదన్‌లోని న్యాస్తా పాయింట్‌కు కారులో బుధవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో బయలుదేరారు. వంశీ కారు డ్రైవింగ్ చేస్తుండగా ముందు సీటులో ముకేశ్, వెనుక సీటులో పవన్ రెడ్డి, సాయి కుమార్, కల్యాణ్ ఉన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వంశీ సాయిబాబా టెంపుల్ వద్దకు రాగానే కాంపౌండ్ వాల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పవన్‌రెడ్డి తీవ్ర గాయాలు కావడంతో అపోలో ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. వంశీ, ముఖేశ్, కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పవన్ రెడ్డి సోదరుని ఫిర్యాదు మేరకు కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.